క్లుప్తంగా...

సీబీఐటీకి రూ.2 కోట్ల ప్రాజెక్టు

మణికొండ: భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ చేపడుతున్న 'చిప్‌టు స్టార్టప్' కార్యక్రమంలో దేశీయంగా చిప్‌ల తయారీపై పరిశోధన కోసం ఉస్మానియా యూనివర్సిటీ, సీబీఐటీలకు రూ.2కోట్ల విలువల ప్రాజెక్టును మంజూరు చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ ప్రధాన పరిశోధకుడు మహమ్మద్ జియాఉద్దీన్ జహంగీర్, ప్రాజెక్ట్ కో– చీఫ్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కృష్ణారెడ్డిలను ప్రిన్సిపాల్ అభినందించారు. రీసోర్స్‌పర్సన్‌లు డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ ఎం.భానుచందర్‌లు చేసిన కృషిని కొనియాడారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'



శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో 'కంటివెలుగు' కార్యక్రమం కొనసాగుతోంది. అంధత్వ నివారణకోసం రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వార్డు సభ్యుడు జహంగీర్ శుక్రవారం సూచించారు. ప్రభుత్వం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

జలమండలి బిల్లుల మోత!

ఒకేసారి రెండేళ్ల బిల్లులు జారీ చేయటంతో పాటు ఈ నెలాఖరులోగా మొత్తం చెల్లించకపోతే కనెక్షన్‌లను తొలగిస్తామని జలమండలి సిబ్బంది హెచ్చరిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- రెండేళ్ల (25 నెలలు) బిల్లుల జారీ
- పాత బిల్లులను తొలగించాలని ప్రజల డిమాండ్



జలమండలి జారీచేసిన వేలాది రూపాయల బిల్లు



మణికొండ జలమండలి కార్యాలయం

మణికొండ: నగర శివారులోని మున్సిపాలిటీల పరిధిలో నీటి సరఫరా వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం 2021 ఏప్రిల్ నుంచి జలమండలికి అప్పగించింది. వారు తీసుకున్న వెంటనే అప్పటికే ఉన్న నీటి కనెక్షన్‌లకు క్యాన్‌నెంబర్‌లను జారీచేసి నెలవారీ బిల్లులు వేయాల్సిన బాధ్యతను విస్మరించారు. ప్రస్తుతం ఏకంగా 25 నెలల బిల్లులు చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నారు.

- గతంలో గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న నీటి కనెక్షన్‌ల వివరాలను తీసుకుని వాటి ప్రకారం కూర్చున్న చోటనే క్యాన్ నెంబర్లను జారీ చేసుకునే అవకాశం ఉన్నా.. ఆ పనులను చేయలేదనే విమర్శలున్నాయి.
- గతేడాది మొదట్లోనే గృహాల వారీగా వచ్చి క్యాన్ సర్వేను చేపట్టారు. సగం మందికి కూడా క్యాన్‌నెంబర్లు జారీ కాకపోవడం గమనార్హం.

విజిలెన్స్ విచారణతో మేల్కొని..

- మణికొండ జలమండలి డివిజన్ 18 పరిధిలో 50 శాతం వరకు ఎలాంటి క్యాన్‌నెంబర్లు, బిల్లులు లేకుండా నీటిసరఫరా చేస్తున్నారని ఇటీవల జలమండలి ట్విట్టర్ అకౌంట్‌కు కొందరు స్థానికులు ఫిర్యాదులు చేశారు. దీంతో మేల్కొన్న జలమండలి ఉన్నతాధికారులు క్యాన్ నెంబర్లు లేకుండా కనెక్షన్‌లు ఉన్నాయనే విషయాన్ని తేల్చేందుకు విజిలెన్స్ సర్వే చేపట్టింది.
- వందలాది ఇళ్లకు క్యాన్ నెంబర్లు లేకుండా నీటి సరఫరా అవుతుందని నివేదిక ఇవ్వటంతో స్థానిక జలమండలి అధికారులు నెలరోజుల్లోనే నెంబర్లను కేటాయిస్తున్నారు. దీంతో ఒకేసారి 25 నెలల బిల్లులు చెల్లించాలని డిమాండ్ నోటీసులను జారీ చేస్తున్నారు.

సీవరేజ్ పనులు చేస్తున్నదెవరు..?

- మున్సిపాలిటీలలో డ్రైనేజీల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను ఇప్పటి వరకు స్థానిక మున్సిపాలిటీలే చూస్తున్నాయి. మున్సిపాలిటీ వద్ద జీతాలు తీసుకుంటున్న సిబ్బందే నిత్యం పనులు చేస్తున్నారు. దీనికి అవసరమైన వాహనాలను సైతం మున్సిపాలిటీ నిధుల నుంచే కొనుగోలు చేశారు. అయినా సీవరేజ్ ఛార్జీల రూపంలో జలమండలి బిల్లులలో రూ. వందలు, వేలల్లో వేసి దండుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.
- మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఇప్పటి వరకు కోట్లాది రూపాయల మున్సిపాలిటీ నిధుల నుంచే తాగునీటి సరఫరా పైప్‌లైన్లు వేశారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల నీటి సరఫరాకు వేయాల్సిన పైప్‌ల కంటే ముందే వాటిని మున్సిపాలిటీల నిధులతో చేపట్టారు.
- నీటి సరఫరా, డ్రైనేజీ పైప్‌లైన్ల పనులను మున్సిపాలిటీల నిధులతో చేపట్టి బిల్లులు మాత్రం జలమండలి వారు తీసుకోవటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాత వాటిని తొలగించాలని కోరినా...

సకాలంలో వేయాల్సిన బిల్లులను వేయకుండా తాత్సారం చేయటంతో పాటు వినియోగదారులకు ఏకంగా రూ.వేలల్లో బిల్లులు జారీచేస్తే చెల్లించలేరని పాత బిల్లులను తొలగించాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తుంది. క్యాన్ నెంబర్ జారీ చేసిన ప్పటి నుంచి బిల్లులు వేస్తేనే చెల్లిస్తామని వారు చెబుతున్నారు. గత రెండేళ్ల బిల్లులను తొలగించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, జలమండలి ఎండీ దానకిషోర్‌కు విన్నవించామన్నారు. ఆ విషయం తేలకముందే ఈ నెలాఖరులోపు పూర్తి బిల్లులు చెల్లించాలని లేదంటే కనెక్షన్‌లు తొలగిస్తామని అధికారులు హెచ్చరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'సిక్కులకు ఇళ్ల పట్టాలిచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే'..!



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: 150 ఏళ్లకు పైగా ఏ ప్రభుత్వాలు పట్టించుకోని సిక్కులకు తగిన ప్రాధాన్యత రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ సిక్‌చావనీకాలనీ లబ్ధిదారులకు రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎవరు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో గురు ద్వారాలో సిక్కులు నిత్యం అన్నదానం చేస్తున్నారని వారు మానవతావాదులన్నారు. తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సిక్కులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ చంద్రకళ, ఎమ్మార్వో చంద్రశేఖర్, అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్, రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్, వనం శ్రీరామ్‌రెడ్డి, రగడంపల్లి శ్రవణ్, సాయి మాలిక్, పడమటి శ్రీధర్‌రెడ్డి, ఝాన్సీఉమారెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ జీవవైవిధ్యం, పరిశోధనలపై ఒప్పందం



ఒప్పందాలపై సంతకాలు చేసుకున్న అధికారులు

ఏజీవర్సిటీ: దూలపల్లిలోని అటవీ జీవవైవిధ్యం, రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సుధీర్ కుమార్, అటవీజీవవైవిధ్య సంస్థ డైరెక్టర్ వెంకట్ రెడ్డి ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా అటవీ వ్యవసాయంలో తమ సంస్థకు ఉన్న అనుభవాలను వెంకట్‌రెడ్డి వివరించారు. ఇరు సంస్థలు వ్యవసాయంలో చేపట్టాల్సిన పరిశోధనల గురించి మాట్లాడుకున్నారు. విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన జీవవైవిధ్య వనస్థలి (అటవీ) దేశంలోనే మొదటిదని దీని సంరక్షణ కోసం విశ్వవిద్యాలయం తీసుకున్న చర్యలు, ప్రత్యేక శ్రద్ధ గురించి రిజిస్ట్రార్ వివరించారు.

- సుస్థిరమైన లాభదాయకమైన అటవీ వ్యవసాయ నమూనాలను రూపొందించి రైతులకు చేరవేశామన్నారు. అంతర్జాతీయ పరిశోధనా కార్యక్రమాల సంచాలకులు డాక్టర్ జమునా రాణి, అగ్రో ఫారెస్ట్రీ విభాగం ప్రధాన శాస్త్రవేత్త రామాంజనేయులు, విశ్వవిద్యాలయం అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్ల తయారీపై విద్యార్థులకు శిక్షణ..



డ్రోన్లు ఎగిరే విధానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు



విడిభాగాలతో డ్రోన్లను తయారు చేస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మోజెర్ల ఉద్యాన కళాశాల నిర్వహిస్తున్న పంటలపై డ్రోన్ టెక్నాలజీ ఉపయోగాలపై నిర్వహిస్తున్న శిక్షణ రెండోరోజుకు చేరింది. శుక్రవారం డ్రోన్ల తయారీ వాటి విడిభాగాలు, చార్జింగ్ విధానంపై శాస్త్రవేత్తలు విద్యార్థులకు వివరించారు. ఈ శిక్షణలో వివిధ పరిమాణం, ఆకృతిలో ఉన్న డ్రోన్లను మరియు మందుల పిచికారీ చేసే విధానాన్ని ప్రత్యేక్షంగా చూపించారు. అసోసియేట్ డీన్ చీనానాయక్ మాట్లాడుతూ.. ఉద్యాన విద్యార్థులందరూ.. డ్రోన్ల తయారీ విధానం, వాటిని పంటలపై ఉపయోగించే తీరును తెలుసుకోవాలన్నారు. ఈ డ్రోన్‌లను తక్కువ పెట్టుబడితో తయారుచేసి తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాల పంటలకు మందు ద్రావణాలను పిచికారి చేయవచ్చని సూచించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజా ప్రభాకర్ సహకారంతో విద్యార్థులకు భవిష్యత్తులో మరిన్ని శిక్షణ తరగతులను నిర్వహించి ప్రోత్సహిస్తామన్నారు. శాస్త్రవేత్తలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సైదయ్య, షహానాజ్, అశ్విన్‌కుమార్, సాయికృష్ణ నిఖిల్, ఎవియేషన్ డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలని వినతి

శంషాబాద్ రూరల్: గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ పిల్లోనిగూడ వాసులు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు శుక్రవారం కలిసి విన్నవించారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కోరారు. పాల్మాకుల–పిల్లోనిగూడ మార్గంలో ఉన్న రైల్వేగేటు పునఃప్రారంభం కోసం చొరవ తీసుకున్న ఎంపీ, ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు రమేష్‌పటేల్, నర్సింహ, కృష్ణ, సుధాకర్, తదితరులున్నారు.

ఎంసెట్ ఫలితాల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో ఉన్న మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎంసెట్–2023 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. 17 మంది ఇంజినీరింగ్ విభాగంలో 21మంది మెడికల్, అగ్రికల్చర్ విభాగంలో ప్రవేశాలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ విష్ణుప్రియ తెలిపారు. 5 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌కు ఎంపికైనట్లు వివరించారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మోడల్ స్కూల్ విద్యార్థులు ర్యాంకులు సాధించడం హర్షనీయమన్నారు.

'చలివేంద్రాలతో ప్రజలకు ఉపశమనం'



చలివేంద్రాన్ని ప్రారంభించిన వీఫర్‌యూ సంస్థ ప్రతినిధులు

మణికొండ: వేసవి ఎండలకు అనుగుణంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలతో ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని వీఫర్‌యూ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బాపూజీ అన్నారు. శుక్రవారం ప్రతిభ స్కూల్ ఎదురు రోడ్డులో కూడలి వద్ద సంస్థ కోశాధికారి దిలిప్‌కక్కడ్ వారి తల్లితండ్రుల పేరుతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సంస్థ ప్రధానకార్యదర్శి సీతారాందాస్, సభ్యులు లక్ష్మణ్‌రావు, ప్రదీప్‌రావు, సాంబశివరావు, నాగేంద్రరావు, శివరామకృష్ణ తదితరులున్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్పాశ్రీనివాస్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ పుష్పాశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదర్షాకోట్ ప్రభుత్వ పాఠశాల ఆవరణ నుంచి వర్షపు నీరు ఎర్రకుంటలోకి మళ్లించడానికి పైపులైన్ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎర్రకుంటలో వర్షం నీరు ఎప్పటికీ నిలిస్తే భూమిలో నీరు ఉండి బోర్లు ఎండిపోకుండా ఉంటాయనే ఉద్దేశంతో వర్షపునీటిని శాంతినగర్ రోడ్డు మీదుగా ప్రవహిస్తున్నాయన్నారు. దారి మళ్లించి ఎర్రకుంటలోకి నీరు వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో సుమారుగా హైదర్షాకోట్ గ్రామస్తులతో పాటు చుట్టుపక్కలా 20 కాలనీల వాసుల దాహార్తిని తీర్చినట్లుగా ఉంటుందని ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. డీఈ యాదయ్య, కాంగ్రెస్ యువనాయకులు టింకురెడ్డి, రామ్‌రెడ్డి, లక్ష్మినగర్, భాగ్యనగర్‌కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం



విద్యార్థులను సన్మానించిన కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: పట్టణంలోని ఇంద్రానగర్ దొడ్డి బస్తీకి చెందిన రమేష్ కుమార్తె అర్చన ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, కుమారుడు వినయ్‌తేజ్ పదోతరగతిలో పదికి పదిపాయింట్లు సాధిండంతో స్థానిక కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్ వారిని అభినందించారు. బీజేపీ ముఖ్య నేతల సమక్షంలో వారిద్దరిని సన్మానించి రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత చదవులు చదివి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఉచిత వైద్య శిబిరం



రాజేంద్రనగర్: తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఆధ్వర్యంలో బుద్వేల్‌లోని పాఠశాలలో శుక్రవారం ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. 50 రకాల పరీక్షలను ఈ కేంద్రంలో ఉచితంగా నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపును శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయిమాలిక్ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన దాదాపు 100 మంది ఈ వైద్య శిబిరంలో పాల్గొని ఉచిత సేవలు పొందారు.

నేడు పద్మశాలి భవన నిర్మాణానికి భూమి పూజ

మణికొండ: పద్మశాలి భవన భూమి పూజ కార్యక్రమాన్ని కోకాపేట్‌లో నిర్వహిస్తున్నట్లు మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రామేశ్వరం నర్సింహ్మ అన్నారు. ఆయన మాట్లాడుతూ కోకాపేట్‌లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు పద్మశాలి భవన భూమి పూజ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ముఖ్య అతిథిగా మంత్రి హరీష్‌రావు, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ ఎల్.రమణ, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌లు హాజరుకానున్నట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మేయర్, డిప్యూటీ మేయర్, కౌన్సిలర్లు, డైరెక్టర్లు, కో–ఆప్షన్ సభ్యులు, గ్రామ అధ్యక్షులు, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: రోజూ గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని 'సాక్షి'లో వచ్చిన 'మణికొండలో విద్యుత్ సమస్య' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు ఉన్న 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో సామర్థ్యం పెంచి 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. మణికొండలో పెరిగిన విద్యుత్ వాడకాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను పూర్తిగా నివారించే క్రమంలో గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు ఏరియాను విభజించారు. దీంతో భవిష్యత్తులో మణికొండ పాత గ్రామంలో విద్యుత్ సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకున్నామని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. కౌన్సిలర్లు శ్వేతారవికాంత్‌రెడ్డి, ఎల్.వందనానగేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



రాజేంద్రనగర్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం పార్టీ కార్యాలయం గోడకి కమలం పువ్వు ప్రతిమను వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ స్థాయి నుంచి నియోజకవర్గం వరకు ప్రతి ఒక్క కార్యకర్త, తన ఇంటి గోడ, పార్టీ కార్యాలయం పరిసరాల్లో కమలం పువ్వు ప్రతిమను వేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అడికే జనార్దన్, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, చిన్న, శ్రీకాంత్‌రెడ్డి, మాజర్, పాండుయాదవ్, గణేష్, శివరెడ్డి, అవినా ష్, నిహాల్‌యాదవ్, చింటు తదితరులున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ముగ్గురికి స్వల్ప గాయాలు



రాజేంద్రనగర్: పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే మీద కారు అదుపు త్ప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎక్స్‌ప్రెస్‌వే పై రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆరాంఘర్ నుంచి వస్తున్న ఓ కారు వేగంగా దూసుకొచ్చి పిల్లర్ నంబర్ 151 వద్ద డివైడర్‌ను ఢీ కొట్టింది. డివైడర్ పై ఉన్న పూల తొట్టెను కారు బలంగా ఢీకొట్టడంతో ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ వాహనంలో ఉన్న ముగ్గురికి గాయాలు కావడంతో స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ కారు వెనకాలే ఉన్న మరో కారు వెనుక నుండి ఢీకొట్టడంతో కారు పాక్షికంగా ధ్వంసమైంది. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పర్‌పల్లి వేంకటేశ్వరకాలనీకి చెందిన నాగరాజు (48) స్థానికంగా చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తుంటాడు. అతడికి ఇద్దరు భార్యలు. కాగా మొదటి భార్య వేసవి సెలవులు కావడంతో ఊరికెళ్లింది. రెండో భార్య కొన్ని రోజుల క్రితం మరో వ్యక్తితో వెళ్లినట్లు సమాచారం. ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందిపడుతున్న నాగరాజు గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో స్థానికులు అతడి సోదరుడికి సమాచారం అందించాడు. వచ్చి చూసేసరికి ఉరేసుకుని కనిపించాడు. స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పంచనామా చేసిన పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



డ్రైవ్‌లో పాల్గొన్న కార్మికులు తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను చేపట్టారు. 8,17వ డివిజన్‌లలో కార్పొరేటర్లు బుర్రభూపాల్‌గౌడ్, మద్దెల లతప్రేమ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించారు. పారిశుధ్య సిబ్బంది రోడ్లను శుభ్రంగా ఊడ్చి, పేరుకుపోయిన చెత్తచెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్తచెదారాలను వేయవద్దన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తడి, పొడి చెత్తపై ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య కార్మికులు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

ప్రజల్లోకి మోదీ సుపరిపాలన తీసుకెళ్లాలని పిలుపు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

శంషాబాద్: ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి సూచించారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మే 30 నుంచి జూన్ 30 వరకు 13 అంశాలుగా మహాజన్ సంపర్క్ అభియాన్ పేరిట పోలింగ్ బూత్ స్థాయి నుంచి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి వరకు విస్తృతంగా బీజేపీ నేతల్లో ప్రజల్లోకి వెళ్లాలన్నారు. 9 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజల పురోభివృద్ధికి తీసుకున్న చర్యలను వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కూడా ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. పరీక్షలను సైతం సజావుగా నిర్వహించలేదని అసమర్థ పాలనపై ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. నెలరోజుల పాటు జరిగే కార్యక్రమాలకు ఈ సందర్భంగా ఇన్‌చార్జ్‌లను నియమించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్; పోరెడ్డి నర్సింహారెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్ పాపయ్యగౌడ్, బోసుపల్లి ప్రతాప్, లచ్చిరెడ్డి, అందెల శ్రీరాములు, శ్రీవర్ధన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, అశోక్, ప్రకాష్, శంకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మిద్దెల సుదర్శన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా ,కౌన్సిలర్ కె.ప్రవీణ్‌గౌడ్, నాయకులు దేవేందర్, మహిపాల్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి



చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి

రాజేంద్రనగర్: పేద ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఎనలేనిదని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం ఉప్పర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. 9 ఏళ్లు పూర్తైన సందర్భంగా మహా జాన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మే 30 నుంచి జూన్ 30 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 23 జూన్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమం ప్రతీ పోలింగ్ బూత్‌లో నిర్వహిస్తామన్నారు. 28 జూన్ నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమం ప్రతీ పోలింగ్ బూత్‌లో నిర్వహించాలన్నారు. జూన్ 28న ఎమర్జెన్సీ డే కార్యక్రమాన్ని ప్రతీ పోలింగ్‌బూత్‌లో నిర్వహించాలన్నారు. జూన్ 23 నుంచి 30 వరకు పోలింగ్ బూత్‌ల వారీగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసి మిస్డ్ కాల్ చేపించాలని సూచించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్, యువమోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి బొక్క బాల్‌రెడ్డి, మూల శ్రీనివాస్, సోల్కర్‌రెడ్డి, హరికిషన్, విఠల్, శ్రీకాంత్‌రెడ్డి, కీర్తి, శ్రీను, ఎస్.రాహుల్, రమాకాంత్, రఘుమరెడ్డి, పవన్, మల్లేష్ చారి, స్వప్నరెడ్డి, రాకేష్‌గౌడ్ తదితరులున్నారు.